క్లుప్తంగా

నేడు గ్రామసభలు

దొరవారిసత్రం/పెళ్లకూరు/వెంకటగిరిరూరల్ : దొరవారిసత్రం, పెళ్లకూరు, వెంకటగిరి రూరల్ మండలాల్లో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 2024–25 సంవత్సరానికి అభివృద్ధి పనులు ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలు రఘురామయ్య, సురేష్‌బాబు, కోటేశ్వరరావు తెలిపారు. ఉపాధి కూలీలకు విధి, విధానాలపై అవగాహన, పురోగతిలో పనుల వివరాలు తెలుసుకోవడం, కొత్త పనులకు ప్రతిపాదలను పంపడం, సామాజిక తనిఖీపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఫల సరుకుల పంపిణీ



ఫల సరుకులు అందజేస్తున్న దాతలు

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెంలో గురువారం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతలు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ నిరుపేద కుటుంబాలకు రూ.20 వేల విలువైన ఫల సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. నెల్లూరు జిల్లా శ్రీ వైఖానస సంఘం సభ్యులు కందుకూరు శేషాచార్యులు, వాకాటి కళ్యాణకృష్ణ చేతుల మీదుగా ఆరు కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు, సభ్యులు అరిసి నరేష్ శర్మ, పవన్‌కుమార్, శివకుమార్ పాల్గొన్నారు.

కండలేరులో 5.828 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 5.828 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 85, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిరుద్యోగికి ఆర్థిక సాయం



రవికి నగదు ఇస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ టీమ్

వాకాడు: అనారోగ్యంతో బాధపడుతున్న చిరుద్యోగి వాకాడు దళితవాడకు చెందిన ఎంబేటి రవికి గురువారం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.10 వేల సాయం అందజేశారు. రవి ఒక ప్రయివేట్ విద్యాసంస్థలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఇటీవల బ్రెయిన్ సమస్యతోపాటు పక్షవాతం సంభవించింది. దీంతో పూట గడవడం కష్టంగా ఉంది. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మందుల కోసం రూ.10 వేలు ఇచ్చారు. టీమ్ మేనేజర్ జోనస్ బెన్నై, సభ్యులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను గౌరవిస్తూ జాతర నిర్వహణ

వెంకటగిరి రూరల్: సంప్రదాయాలను గౌరవిస్తూ వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన గురువారం జాతర నిర్వహించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నేతలు

పెళ్లకూరు: తహసీల్దార్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ద్వారకానాథ్‌రెడ్డిని గురువారం ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత నల్రావుల లింగమనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. మండలంలోని భూసమస్యలు, రెవెన్యూ సమస్యలతో పాటు మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని విన్నవించారు. వీరి వెంట నాయకులు గురవయ్య, మునిరాజ వీఆర్వోలు రవిచంద్ర, రమేష్, సుధాకర్ ఉన్నారు.

భూసార పరీక్షకు అనుగుణంగానే ఎరువులు

తడ: భూమి సార పరీక్ష ఫలితాలకనుగుణంగానే ఎరువులు వాడాలని, తద్వారా అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి కే.శ్రీనివాస్ స్పష్టం చేశారు. భూసార పరీక్ష, దాని ఫలితాలపై తడ వ్యవసాయ కార్యాలయంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలతోపాటు రబీలో వేయాల్సిన వరి రకాలు, మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల సాగుపై మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారిణి కాంచన, వ్యవసాయ సిబ్బంది షబీనా, భారతి పాల్గొన్నారు.

బహుళ ప్రయోజనాల ప్యాక్‌హౌస్

- పండ్లు, కూరగాయల నిల్వ
- గ్రేడింగ్, ప్యాకింగ్‌కు సౌకర్యం
- ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ధరలు
- ఉద్యానశాఖ ద్వారా నిర్మాణాలకు 50 శాతం రాయితీ



డక్కిలి మండలం పాతనాలపాడు (కమ్మవారిపల్లి) గ్రామంలో ప్యాక్ హౌస్

డక్కిలి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులకు నాణ్యత ఉంటేనే మార్కెట్లో మంచి ధరలు లభిస్తాయి. వ్యవసాయ ఉత్పత్తులను శుభ్రం చేయకుండా నేరుగా తరలించడంతో నాణ్యత లేక ఆశించిన ధరలు లభించడం లేదు. మరోవైపు మార్కెట్‌లో డిమాండ్ లేని సమయంలో తమ ఉత్పత్తులను ఎక్కువ రోజులు నిల్వ చేసుకోలేక పోతున్నారు. ఇలా పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌లో మెళకువలు పాటించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యను గుర్తించి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఉద్యానశాఖ ద్వారా ప్యాక్ హౌస్ నిర్మాణాలకు రాయితీలు అందిస్తోంది. 50 శాతం రాయితీతో ప్యాక్ హౌస్‌లను నిర్మించుకోవచ్చని వెంకటగిరి ఉద్యానశాఖ అధికారి ఆనంద్‌రెడ్డి తెలిపారు. ప్యాక్‌హౌస్‌లతో రైతులకు కలిగే బహుళ ప్రయోజనాలను ఆయన వివరించారు.

నిర్మాణాలకు 50 శాతం రాయితీ

ప్రభుత్వం సూచించిన మేరకు ప్యాక్‌హౌస్ నిర్మాణానికి రూ.4 లక్షలు ఖర్చు అవుతోంది. అందులో 50 శాతం రాయితీ అంటే రూ.2 లక్షలు ఉద్యానశాఖ రైతులకు అందజేస్తుంది. ప్యాక్ హౌస్ నిర్మించుకోవాలని ఆసక్తి కల వారు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఇంజినీర్ ప్లాన్, అంచనా, భూమి పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డులు జెరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రూ.వంద బాండ్ పేపర్, అఫిడవిట్ అందజేయాల్సి ఉంటుంది.

నిర్మాణం ఇలా..

- 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం ఉండాలి.
- పైకప్పును జీఐ ఐరన్, సిమెంట్ రేకులు లేదా కాంక్రీట్‌తో చేపట్టాలి.
- సిమెంట్ ఫ్లోరింగ్, 8 కిటికీలు, 2 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ ఉండాలి.
- భవనానికి సాధారణ ద్వారం, మరో 8 అడుగుల షట్టర్ నిర్మించాలి.
- ప్యాక్ హౌస్ లోపల కూరగాయలు, పండ్లను శుభ్రపరిచేందుకు మూడు నీటి తొట్టెలు, ఆరబెట్టేందుకు మూడు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి.
- గ్రేడింగ్ టేబుళ్లు, తూకానికి 300 కేజీల ఈ–వేయింగ్ మెషీన్, ప్యాకింగ్ కోసం 250 నంబర్ ప్లాస్టిక్ క్రేట్స్ ఉండాలి.
- ఒక ఇన్వర్టర్, కార్యాలయం టేబుల్, నాలుగు కుర్చీలు, టార్పాలిన్ షీట్లు ఉండాలి.

ఇవీ ప్రయోజనాలు

- రైతులు తాము పండించిన పూలు, పండ్లు, కూరగాయలను సరైన ధర లభించేంత వరకు తాత్కాలికంగా నిల్వ ఉంచుకోవచ్చు.
- పంట ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తరలించకుండా వాటిని శుభ్రం చేసుకోవడంతో పాటు ప్యాకింగ్, గ్రేడింగ్ చేసుకుని తీసుకెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది.
- పంట ఉత్పత్తుల నాణ్యత బాగుండి, మార్కెట్లో మంచి ధరలు లభిస్తాయి.

రైతులకు అధిక లాభాలు



ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన పండ్లు, కూరగాయలకే అధిక ధరలు లభిస్తున్నాయి. ఎక్కువ మంది రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు నేరుగా తీసుకెళ్లి నష్టపోతున్నారు. ప్యాక్ హౌస్ నిర్మించుకుంటే సరుకు నాణ్యంగా మారుతుంది. రైతులు తాము పండించిన పంటలనే కాకుండా ఇతర రైతుల పంటలను ప్యాక్ హౌస్‌లో ప్యాక్ చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.

–ఆనంద్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి, వెంకటగిరి

పచ్చదనాన్ని కాపాడుకుందాం



మొక్కలు నాటుతున్న అధికారులు

సైదాపురం: పచ్చదనాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం తల్లికి ఓ మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమీప కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రయ్య పాల్గొన్నారు.

27న మండల సమావేశం

గూడూరు రూరల్: ఈ నెల 27న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బూదురు గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్త పనులపై తీర్మానాలు చేస్తామని తెలిపారు. అన్ని శాఖలపై సమీక్ష ఉంటుందని, అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

నాగిరెడ్డికి ఎంపీ గురుమూర్తి పరామర్శ



చంద్రశేఖర్ రెడ్డిని పరామర్శించిన ఎంపీ గురుమూర్తి



పోలంరెడ్డి శివకుమార్‌తో మాట్లాడుతున్న సాయికృష్ణయాచేంద్ర

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణానికి చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని గురువారం ఎంపీ గురుమూర్తి పరామర్శించారు. చంద్రశేఖర్ రెడ్డి సోదరుడు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటనారాయణ రెడ్డి కొద్ది రోజుల క్రితం మృతిచెందారు. ఈ క్రమంలో ఎంపీ గురుమూర్తి నాయుడుపేటలోని నాగిరెడ్డి ఇంటి వద్దకు వచ్చి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ఓజిలి, చిట్టమూరు మండలాల కన్వీనర్లు పాదర్తి హరినాథ్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు ముత్యాల్ రెడ్డి, కాళహస్తి భవన్, కలికి ప్రతాప్ రెడ్డి, గొట్టికాటి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలంరెడ్డి కుటుంబానికి..

డక్కిలి: టీడీపీ నేత, డక్కిలి మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ క్రమంలో వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర గురువారం మాటుమడుగు గ్రామం చేరుకుని పోలంరెడ్డి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని వెంకటరెడ్డి కుమారుడు శివకుమార్‌కు సూచించారు.

రేపు గంధోత్సవం

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని దర్గా వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ జాఫర్ మస్తాన్ ఔలియా గంధమహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్టు దర్గా ముజావర్ మగ్దూం అలీషా చిస్టి ఫుల్ ఖాదరి తెలిపారు. ఇందులో వివిధ దర్గాల పీఠాధిపతులు పాల్గొంటారని పేర్కొన్నారు. దర్గాలో అన్నదానం చేస్తామని వెల్లడించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఏడుకొండలు



రాపూరు: రాపూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఏడుకొండలు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన రాపూరు ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఎన్నికల సమయంలో సైదాపురం బదిలీ అయ్యారు. తర్వాత రాపూరు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉండడంతో ఆయన పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న గంగయ్య చిత్తూరుకు బదిలీ అయ్యారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



రాపూరు: మండలంలోని పెనుబర్తికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పుల లీలా మోహన్‌రెడ్డి ఈ నెల 6వ తేదీన గుండెపోటుతో మృతిచెందాడు. వారి స్వగృహంలో గురువారం ఉత్తర క్రియలు నిర్వహించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా, కలపాటి మధుసూదన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి



లీలామోహన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, (ఇన్‌సెట్) మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పోలయ్య

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం మల్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత అవిశపాక పోలయ్య(55) గురువారం ఉదయం హఠాన్మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు నాయకులు గ్రామానికి చేరుకున్నారు. ఆయన భౌతిక దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మల్లాం పీఏసీఎస్ అధ్యక్షుడిగా పని చేశారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం ఎంతో కృషి చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ దివ్య

సైదాపురం: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ఫ్లోరోసిస్ అధికారిణి డాక్టర్ దివ్య తెలిపారు. ఆమె గురువారం సైదాపురం పీహెచ్‌సీ సిబ్బందికి ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తాగునీటిలో ఎక్కువగా ఫ్లోరిన్ ఉంటే దంతాలు, ఎముకలు బలహీనంగా మారుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రావణి, నిత్య ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన

రాపూరు: మండలంలోని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఫ్లోరోసిస్ వ్యాధిపై జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ దివ్య వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వల్ల అంగవైకల్యం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పంటికి అధికంగా గార పడుతుందని పేర్కొన్నారు. ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు రాజకుమారి, సూర్యధర్మేంద్ర, అనిత, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లిలో మోస్తరు వర్షం

బాలాయపల్లి (సైదాపురం): బాలాయపల్లిలో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఎండలు ఎక్కువగా కాస్తుండడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఈ క్రమంలో కురిసిన వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు.

సైదాపురం ఎస్‌ఐగా క్రాంతికుమార్



సైదాపురం: సైదాపురం ఎస్‌ఐగా క్రాంతికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన డీసీఆర్‌బీ నెల్లూరు దిశా ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

గురుకుల పాఠశాల తనిఖీ



గురుకుల పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

డక్కిలి: మండలంలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను గురువారం తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తనిఖీ చేశారు. తాగునీటి కొళాయిలు, వంట గది, పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి రోజూ శానిటేషన్ పనులు చేయాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేంద్ర, గురుకులం సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మండలంలోని మాధవయ్యపాళెం ఎస్టీ కాలనీ, దేవులపల్లి మెయిన్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈవో కె.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాఠశాలల రికార్డులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు.



దొరవారిసత్రం: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో కృష్ణయ్య

మధ్యాహ్న భోజనం తనిఖీ

దొరవారిసత్రం: మండలంలోని మినమనముడి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో కృష్ణయ్య తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. వంట గదిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సును ఢీకొన్న బొలెరో



చికిత్స పొందుతున్న ప్రభ



ప్రియాంక



లక్ష్మమ్మ

రాపూరు: రాపూరు– చిట్వేలి ఘాట్ రోడ్డులో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు, బొలెరో ట్రక్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు.. డక్కిలి మండలం తురకపల్లికి చెందిన 8 మంది బొలెరో ట్రక్‌లో రాజంపేటలో జరిగే కార్యక్రమానికి వెళ్లి తిరిగి బయలుదేరారు. రాపూరు– చిట్వేలి రోడ్డులోని 6వ కిలోమీటర్ వద్ద నెల్లూరు నుంచి రాజంపేటకు వెళుతున్న నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ట్రక్ ఢీకొంది. దీంతో బొలేరోలో ప్రయాణిస్తున్న ప్రభ, లక్ష్మమ్మ, ప్రియాంక గాయపడ్డారు. వారిని రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలుపు నివారణపై అవగాహన



కలుపు మొక్కల నివారణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని పెరియవరం సమీపంలో వద్ద ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రధాన శాస్త్రవేత్త గోవిందరాజులు నిమ్మ సాగులో వయ్యారిభామ కలుపు నివారణపై రైతులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బైకలరటనే పరాన్న జీవి ద్వారా నిమ్మ పంటలో పెరిగే వయ్యారిభామ కలుపు మొక్కలను నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ పరాన్న జీవి ఎరుపు రంగులో ఉండి నల్లటి చారలతో రెక్కలు కలిగి ఉంటుందన్నారు. ఇది వయ్యారిభామ కలుపులో వదిలితే వాటిని నివారిస్తుందని తెలియజేశారు. అనంతరం బైకలరటనే పరాన్న జీవులను సాగులో ఉన్న నిమ్మ పంటల్లో వదిలారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగార్జునసాగర్, కేవీకే శాస్త్రవేత్తలు విజయశ్రీ, నాగార్జునరెడ్డి, తిరుపాల్, రైతులు పాల్గొన్నారు.

భూ సేకరణకే పరిమితమైన ఉప రవాణాశాఖ కార్యాలయం

దొరవారిసత్రం : ఉప రవాణా శాఖ కార్యాలయ భవన నిర్మాణం ఎప్పుడు చేపడతారని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని అక్కరపాక రెవెన్యూలోని సర్వే నంబరు 300లో జాతీయ రహదారికి ఆనుకుని 2014–15లో ఉప రవాణా శాఖ కార్యాలయ భవనం నిర్మించేందుకు 3.50 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. ట్రాన్స్‌పోర్టు అధికారులు భూమిని స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. నిర్మాణాలు చేపట్టలేదు. భూమి ముళ్ల పొదలతో నిండిపోయి చిన్నపాటి అడవిలా కనిపిస్తోంది. ప్రస్తుతం సూళ్లూరుపేట సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఓ ప్రైవేట భవనంలో నిర్వహిస్తున్నారు. అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బందితోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డీవీ సత్రం మండలంలోని అక్కరపాక సమీపంలో భవనాన్ని నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని వాహనదారులు, నియోజవకర్గ ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనం నిర్మాణంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

రైల్వే స్టేషన్‌లో వసతులు కల్పించాలని వినతి



దక్షిణ రైల్వే డీఆర్‌ఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్: దక్షిణ రైల్వే డీఆర్‌ఎం విశ్వనాథ్ గురువారం రాత్రి నాయుడుసపేట రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. చెన్నై నుంచి గూడూరు వరకు పలు రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాటిని పరిశీలించిన డీఆర్‌ఎం అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయనను నాయుడుపేటకు చెందిన పలు ప్రజా సంఘాల నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ సమీపంలోని మేనకూరు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అనుగుణంగా రైళ్లను పొడిగించాలని కోరారు. ముఖ్యంగా చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు వచ్చే మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడింగించాలని, కోవిడ్ సమయంలో రద్దు చేసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు బిట్రగుంట పాస్ట్ రైలును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రెండవ టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నాయుడుపేటను మోడల్ స్టేషన్‌గా మార్చాలని ఆర్యవైశ్య సంఘం తిరుపతి రూరల్ జిల్లా అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్, ఆ సంఘం నాయకులు. విద్యార్థులు, వ్యాపారస్తులు, సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు మస్తాన్, షేక్ రఫీ, ఆర్ రాఘవన్, గూడూరు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఎవరికి న్యాయం చేస్తారు..ఎంత పరిహారం ఇస్తారు?

- కోస్టల్ క్యారిడార్ భూబాధితుల ఆందోళన
- గ్రామసభలో అసంతృప్తి వ్యక్తం చేసిన రైతులు



సమస్యను తహసీల్దార్‌కు వివరిస్తున్న తమ్మినపట్నం దళితులు

చిల్లకూరు: కోస్టల్ క్యారిడార్ భూబాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో గ్రామ సభ నిర్వహించారు. కోస్టల్ క్యారిడార్‌లో భాగంగా సుమారు 914 ఎకరాల భూములను ఏపీఐసీసీ ద్వారా గతంలోనే సేకరించారు. అయితే వీటిలో చాలా భూములు సాగులో ఉండడంతో వారు ప్రస్తుతం పరిహారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వరస్‌కు విన్నవించారు. ఈ మేరకు ఆయన సదరు భూములను పూర్తిగా సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గత 14 రోజులుగా సర్వే చేసి గురువారం లబ్ధిదారుల జాబితాను వారు చదివి వినిపించారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని గ్రామసభ ద్వారా రైతులను కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ పేరుపై ఉన్న భూమిని విస్తీర్ణంలో చూపకపోవడం, ఒకే సర్వే నంబర్‌లో పలువురు పేర్లు ఉండడంతో 'ఎవరికి న్యాయం చేస్తారు.. ఎంత పరిహారం ఇస్తారు..' అంటూ నిలదీశారు. అలాగే తమ్మినపట్నం దళితులు మాట్లాడుతూ తమ పేరుపై ఉన్న భూములను ఎక్కువ భాగం బీడు భూములుగా నమోదు చేశారని, దీనివల్ల తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. భూములు సాగులోనే ఉన్నాయని, గత రెండేళ్లుగా నీటి వనరులు లేక బీడుగా వదిలేశామని చెప్పారు. దళితవాడలోని ప్రతిఒక్కరికీ న్యాయం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులను కోరారు. గ్రామ సభలో చిట్టమూరు, గూడూరు, కోట, వాకాడు మండలాలకు చెందిన డీటీలు, ఆర్‌ఐలు, చిల్లకూరు సర్వేయర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు గౌరవం లేదా?

గ్రామ సభ నిర్వహించే విషయంలో రెవెన్యూ అధికారులు తమకు ఒక్క మాటకూడా చెప్పలేదని తమ్మినపట్నం సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం ఆరోపించారు. గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు కనీసం వీఆర్వోకు కూడా తెలియజేయలేదన్నారు. దీనిపై వీఆర్వో బాలాజీని వివరణ కోరగా మూడు పంచాయతీలకు చెందిన విషయం కావడంతో సర్పంచ్‌లకు ప్రత్యేకంగా చెప్పలేదని, అయితే ఆయా గ్రామాలలో దండోరా మాత్రం వేశామని చెప్పారు.

అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ భవనం నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

చిల్లకూరు : మండలంలోని బూదనం గ్రామం అరుంధతివాడలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అరుంధతివాడలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలు సమీపంలోని బూదనం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు అరుంధతివాడలో భవనం నిర్మించాలని 2018లో నిర్ణయం తీసుకున్నారు. రూ.7 లక్షలతో భవన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి పనులు మొదలు పెట్టి కొంత వరకు పూర్తి చేశారు. తర్వాత బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులను నిలిపివేశారు. ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణం అసంతపూర్తిగా ఉండిపోయింది. పిల్లలు బూదనం వెళ్లి వచ్చేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భవన నిర్మాణం పూర్తి చేసి స్థానికంగానే పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాలని కోరుతున్నారు.